విశ్వకర్మల ఆత్మీయ సమ్మేళనం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న విశ్వకర్మ అసోసియేషన్‌ నాయకులు

బాలానగర్‌: తెలంగాణ విశ్వకర్మ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఓ ఫంక్షన్‌ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. పాటలు, ఆటలతో ఉల్లాసంగా గడిపారు. పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ అధ్యక్షుడు రాజేష్‌కుమార్‌, ఉపాధ్యక్షుడు మాధవన్‌, సెక్రటరీ అనీష్‌, జాయింట్‌ సెక్రటరీ శ్రీజిత్‌, ట్రెజరర్‌ అరుణ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతల స్వీకరణ



మూసాపేట: కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ ఇన్‌స్పెక్టర్‌గా పి. రాజేష్‌ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌ డీఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఇక్కడ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన కొత్తపల్లి ముత్తు సైబరాబాద్‌ రాజేంద్ర నగర్‌ జోన్‌ స్పెషల్‌ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు.

పరీక్ష పే కార్యక్రమాన్ని వీక్షించిన విద్యార్థులు



పరీక్ష పే చర్చ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

మూసాపేట: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరిగిన పరీక్ష పే చర్చ కార్యక్రమాన్ని మూసాపేటలోని పంచశీల స్కూల్‌లో సోమవారం ప్రత్యక్ష ప్రసారాన్ని విద్యార్థులు వీక్షించారు. విద్యార్థుల్లో పరీక్షల పట్ల ఉన్న భయం, ఒత్తిడి తగ్గించటానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని పాఠశాల కరస్పాండెంట్‌ పంచశీల శ్రీనివాస్‌ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా రంగనాథుడి రథోత్సవం



రాయదుర్గం: రంగనాథుడి బ్రహ్మోత్సవాలలో అత్యంత ప్రధాన ఘట్టం రథోత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉదయం రంగనాథస్వామి ఆలయంలో అభిషేకం, అలంకారం చేశారు. పూలు, పండ్లు, మామిడిఆకులతో రథాన్ని అలంకరించారు. అనంతరం అర్చకుల మంత్రోచ్చారణలు, భక్తుల జయజయధ్వానాల మధ్య రథాన్ని లాగారు. పలువురు స్వామి వారిని దర్శించుకున్నారు.

ల్యూసిడా రైటింగ్‌ ఉచిత శిక్షణ ప్రారంభం

జగద్గిరిగుట్ట: జితేందర్‌ హ్యాండ్‌రైటింగ్‌ అకాడమి ఆధ్వర్యంలో ల్యూసిడా రైటింగ్‌ ఉచిత శిక్షణను సోమవారం ప్రారంభించారు. రైటింగ్‌లో ఎంతో ప్రావీణ్యం ఉన్న క్యాలిగ్రఫీ, హ్యాండ్‌ ట్రైనర్‌ వంపు మల్లయ్య మగ్దూం నగర్‌ మండల పరిషత్‌ పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు శిక్షణ మొదలు పెట్టాడు. శిక్షణ వారం రోజుల పాటు కొనసాగుతుందని, పరీక్షలు దృష్టిలో పెట్టుకొని 10వ తరగతి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు మల్లయ్య తెలిపారు.

భవన నిర్మాణ కార్మికుడి మృతి

బాలానగర్‌: బాలానగర్‌ డివిజన్‌ పరిధిలోని నైపర్‌ క్యాంపస్‌లో సోమవారం భవన నిర్మాణ కార్మికుడు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. బాలానగర్‌ పోలీసుల కథనం ప్రకారం.. నైపర్‌ క్యాంపస్‌లో సాయంత్రం కొత్తగా నిర్మాణంలో ఉన్న జీ ప్లస్‌ త్రీ భవనంలో నూపేంద్ర నీ పాణి (45) సెంట్రింగ్‌ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు మూడో అంతస్తు నుంచి పడిపోయాడు. తలకు తీవ్రమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మతి చెందారు. మృతుడు బంధువు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బాలానగర్‌ పోలీసులు తెలిపారు.

పట్టపగలూ వెలుగులే!

స్నేహపురి కాలనీలో పట్టపగలు వెలుగుతున్న వీధిలైటు



గాయత్రినగర్‌లో..



అల్లాపూర్‌లో ..



బబ్బుగూడ, అవంతినగర్‌ తోట, పీఆర్‌నగర్‌ వీకర్‌ సెక్షన్‌, అల్లాపూర్‌ డివిజన్‌లోని గాయత్రినగర్‌లో కొన్ని నెలల నుంచి ప్రధాన వీధుల్లోని వీధి లైట్లు పట్టపగలూ వెలుగుతూనే ఉన్నాయి. ఆన్‌ ఆఫ్‌ సిస్టం లేకపోవడంతో ఈ సమస్య ఎదురవుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిరంతరం వెలుగుతున్న వీధిలైట్లకు ఆన్‌, ఆఫ్‌ సిస్టం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. –మోతీనగర్‌

పైపులైన్‌ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి

ఎమ్మెల్యే గాంధీ



పైపులైన్‌ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ తదితరులు

మియాపూర్‌: తాగునీటి పైపులైన్‌ మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అధికారులకు సూచించారు. మియాపూర్‌ –బొల్లారం రోడ్డులోని సత్యలక్ష్మీ కాలనీ వద్ద పైప్‌లైన్‌ మరమ్మత్తు పనులను కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌, జలమండలి అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాగునీటి పైప్‌లైన్‌ పాతది కావడంతో పగిలిపోయిందని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చేపడుతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు, డీజీఎం వెంకటేశ్వర్లు, నాయకులు తదితరులున్నారు.

సీయూఈటీ-పీజీ పరీక్షలను ప్రాదేశిక భాషల్లో నిర్వహించాలి

రాయదుర్గం: విద్య సమానత్వం కోసం కామన్‌ యూనివర్సిటీ ఎంట్రెన్స్‌ టెస్ట్‌ ఫర్‌ పోస్టు గ్రాడ్యుయేట్‌ (సీయూఈటీ–పీజీ) పరీక్షలను ప్రస్తుత ద్విభాషా విధానమైన ఇంగ్లిష్‌, హిందీకి పరిమితం చేయకుండా ప్రాదేశిక భాషల్లో కూడా నిర్వహించాలని ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్‌ అసోసియేషన్‌ జాతీయ అధ్యక్షుడు, హెచ్‌సీయూ పరిశోధక విద్యార్థి జి కిరణ్‌కుమార్‌ డిమాండ్‌ చేశారు. ఈ విషయంలో నేషనల్‌ టెస్టింగ్‌ ఏజెన్సీ(ఎన్‌టీఏ) తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ముఖ్యంగా పల్లెల్లో, సామాజికంగా వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులెక్కువగా ప్రాదేశిక భాషల్లోనే విద్యనభ్యసిస్తున్నారని, వారు పోటీ పడటం కష్టతరం చేస్తోందన్నారు. సీయూఈటీ–పీజీ పరీక్షల్లో ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యం లేకపోవడం, ప్రభుత్వం ప్రతిపాదించిన సమానమైన విద్యా అవకాశాల లక్ష్యానికి విరుద్ధమన్నారు. ప్రాదేశిక భాషా ఎంపికలను ప్రవేశపెట్టాలని డిమాండ్‌ చేశారు.

సభలను విజయవంతం చేయండి



కరపత్రాన్ని విడుదల చేసిన ఎంసీపీఐయూ నాయకులు

మియాపూర్‌: మాజీ ఎంసీపీఐయూ పొలిట్‌బ్యూరో సభ్యులు స్వర్గీయ కామ్రేడ్‌ తాండ్రకుమార్‌ వర్ధంతి సందర్భంగా ఫిబ్రవరి 14 నుండి 21 వరకు జరిగే కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వనం సుధాకర్‌ పిలుపునిచ్చారు. మియాపూర్‌ టేక్‌ నర్సింహనగర్‌ కాలనీలో కార్యక్రమాలకు సంబంధించిన కర పత్రాన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తాండ్ర కుమార్‌ వర్ధంతి సందర్భంగా ఫిబ్రవరి 14 నుండి 21 వరకు రాష్ట్ర వ్యాప్తంగా భూమి, ఇండ్లు, ఇళ్ల స్థలాలు ప్రభుత్వ విధానాలు– మన కర్తవ్యం అనే అంశంపై సభలు, సమావేశాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఫిబ్రవరి 14న మియాపూర్‌ క్రాస్‌ రోడ్డు వద్దనున్న స్వర్గీయ కామ్రేడ్‌ తాండ్ర కుమార్‌ విగ్రహం నుండి టేకు నర్సింహ్మనగర్‌ కాలనీ వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం టేకు నర్సింహ్మనగర్‌ కాలనీలో స్వర్గీయ తాండ్ర కుమార్‌ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రేటర్‌ హైదరాబాద్‌ సహాయ కార్యదర్శి తుడుం అనిల్‌కుమార్‌, సభ్యులు తాండ్ర కళావతి, కర్ర దానయ్య, ఇస్లావత్‌ దశరథ్‌ నాయక్‌, పల్లె మురళి, తుకారాం నాయక్‌, భాగ్యమ్మ తదితరులున్నారు.

ప్రజావాణి.. 6 వినతిపత్రాలు



శేరిలింగంపల్లి సర్కిల్‌లో.. డిప్యూటీ కమిషనర్‌ ముకుంద్‌రెడ్డి, ఇతర అధికారులు

చందానగర్‌ : చందానగర్‌ సర్కిల్‌– 21 కార్యాలయంలో సోమవారం ఉపకమిషనర్‌ మోహన్‌రెడ్డి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు వినతిపత్రాలు అందగా మూడు టౌన్‌ప్లానింగ్‌, మూడు రెవెన్యూ విభాగాలకు సంబంధించినవి కాగా వెంటనే సమస్యలను పరిష్కరించాలని డీసీ మోహన్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.

శేరిలింగంపల్లి సర్కిల్‌లో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో డిప్యూటి కమిషనర్‌ ముకుంద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణిలో ప్రజలు 3 ఫిర్యాదులు అందజేశారు. రెవెన్యూ, ఇంజినీరింగ్‌, టౌన్‌ప్లానింగ్‌ విభాగాలకు ఒక్కొక్క దరఖాస్తు చొప్పున వచ్చినట్లు అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఏసీపీ వెంకటరమణ, ఏఎంసీలు ప్రేమ్‌కుమార్‌, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, అర్బన్‌ బయోడైవర్సిటీ సర్కిల్‌ మేనేజర్‌ యూసుఫ్‌, ప్రాజెక్టు ఆఫీసర్‌ మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే వివేకానంద్‌, చైర్మన్‌ శ్రీశైలంయాదవ్‌

కుత్బుల్లాపూర్‌: మౌలిక సదుపాయాలను కల్పిస్తూ మెరుగైన పాలన అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే వివేకానంద్‌ అన్నారు. సోమవారం కొంపల్లి మున్సిపల్‌ పరిధి చంద్రా విల్లాస్‌, సిల్వర్‌ లీఫ్‌, అపర్ణా పామ్స్‌ గ్రోవ్స్‌, రాయల్‌ పార్క్‌ 2, వడ్డెర బస్తీ ప్రాంతాల్లో రూ.1.2 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులను మున్సిపల్‌ చైర్మన్‌ సన్న శ్రీశైలం యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కొంపల్లి మున్సిపల్‌ అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడు ఉంటుందన్నారు. పనులు పూర్తయితే పారిశుద్ధ్య వ్యవస్థ మెరుగుపడనుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మున్సిపల్‌ అధ్యక్షుడు ప్రభాకర్‌ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు దేవేందర్‌ యాదవ్‌, రవీందర్‌ యాదవ్‌, వినోద్‌, ప్రవీణ్‌ రావు, డప్పు కిరణ్‌, లక్ష్మణ్‌, సంగీతారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

గ్యాస్‌ లీకై మహిళకు తీవ్ర గాయాలు

జగద్గిరిగుట్ట: గ్యాస్‌ లీకవడంతో మహిళకు తీవ్ర గాయాలైన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. పాపి రెడ్డి నగర్‌ రోడ్డు నంబర్‌ 12లోని ఓ ఇంటిలో సోమవారం వంట చేస్తుండగా గ్యాస్‌లీకై ఒక్కసారిగా మంటలు రావడంతో వంట చేస్తున్న సువర్ణ(65) అనే మహిళ తీవ్రంగా గాయపడింది. అప్రమత్తమైన స్థానికులు సిలిండర్‌ను వెంటనే ఇంటి బయటకు తరలించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. పోలీసులకు సమాచారం అందించి గాయపడ్డ మహిళను ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షగుఫ్తా పర్వీన్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థినికి సోమవారం పీహెచ్‌డీని ప్రకటించారు. ఉమెన్‌ స్టడీస్‌ విభాగంలో పర్వీన్‌ 'ది చాలెంజెస్‌ ఆఫ్‌ హోమ్‌ బేస్డ్‌ ఉమెన్‌ వర్కర్స్‌–ఎ క్రిటికల్‌ స్టడీ' అనే అంశంపై ఉమెన్‌ ఎడ్యుకేషన్‌ విభాగం అసోసియేట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ పర్వీన్‌ కమర్‌ పర్యవేక్షణలో పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు. దీన్ని పరిశీలించి పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు.

ప్రత్యేక పూజలు

శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్‌ నేతాజీనగర్‌లోని అభయాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు కనులపండువగా సోమవారం నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. ఈ వేడుకల్లో మాజీ కార్పొరేటర్‌ కొమిరిశెట్టి సాయిబాబా పాల్గొన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు యు.శేఖర్‌ సాగర్‌, కమిటీ ప్రతినిధులు సాయిబాబాను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వెంకటేష్‌గౌడ్‌ పాల్గొన్నారు.

విక్రయదారులపై చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్‌: కోర్టు వివాదంలో ఉన్న స్థలాలను అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలని బహదూర్‌పల్లి మాజీ సర్పంచ్‌ సుజాత శ్రీహరి సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. బహదూర్‌పల్లిలోని సాయినాథ్‌ సొసైటీ సర్వే నంబర్‌ 227/1 లో 353 ఎకరాల 30 గుంటల విస్తీర్ణంలో కొంతమంది 2009లో వెంచర్‌ చేశారని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ కోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. స్థానికంగా కాలనీ ప్రెసిడెంట్‌గా చెప్పుకునే ఓ వ్యక్తితో పాటు మరో వ్యక్తి ప్రభుత్వ భూమిలో ఉన్న ప్లాట్లను అమాయకులకు అంటగడుతూ కోట్ల రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సదరు వ్యక్తులపై శాఖా పరమైన చర్యలు తీసుకుని అమ్మకాలను నిలిపివేయాలని కోరారు.

ఘనంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

కుత్బుల్లాపూర్‌: కుత్బుల్లాపూర్‌ గ్రామంలోని వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 10 గంటలకు ఉత్సవ ఆరంభ స్నపనం, సాయంత్రం 6.30 గంటలకు విష్వక్సేనారాధన, వాసుదేవ పుణ్యాహవాచనం, అంకురారోపణం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన జాతర ఈ నెల 14న జరుగనుందని ఆలయ చైర్మన్‌ ఠాకూర్‌ రాజేందర్‌సింగ్‌ తెలిపారు.

యువతి అదృశ్యం

మియాపూర్‌: యువతి అదృశ్యమైన సంఘటన మియాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాణిక్యం తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్‌ దీప్తిశ్రీనగర్‌ కాలనీకి చెందిన అనిల్‌ దాస్‌, పర్బాతిదాస్‌ దంపతులు కూలీ పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నారు.వీరికి కూతురు రాధా రాణీ దాస్‌(20) ఉంది. జనవరి 1వ తేదీ వీరు కూలీ పనికి వెళ్లారు. కూతురు రాధ ఇంటివద్దే ఉంది. సాయంత్రం తల్లిదండ్రులు ఇంటికి వచ్చేసరికి కూతురు రాధారాణీ దాస్‌ కనిపించలేదు. చుట్టుపక్కల స్నేహితులు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆందోళన చెందిన పర్బాతిదాస్‌ మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మియాపూర్‌ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

అక్రమ ప్రహరీ నిర్మాణం కూల్చివేత



నిజాంపేట్‌: నిజాంపేట్‌లో సర్వే నంబర్‌ 233/21లో ప్రహరీ నిర్మాణాన్ని బాచుపల్లి తహసీల్దార్‌ పూల్‌సింగ్‌ ఆధ్వర్యంలో సోమవారం కూల్చివేశారు. ఉదయం నిర్మాణ ప్రాంతానికి వెళ్లి నిర్మాణదారుల పత్రాలను పరిశీలించారు. అనంతరం ఇది ప్రభుత్వ స్థలమని, ఇక్కడ నిర్మాణం చేయడానికి వీలు లేదని కూల్చివేయించారు. ఆదివారం పనులు ఆపేందుకు వచ్చిన ఆర్‌ఐ పట్ల సదరు నిర్మాణదారులు ప్రవర్తించిన తీరుపట్ల తహసీల్దార్‌ ఆగ్రహంవ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారి వచ్చి పనులు ఆపమంటే ఎందుకు ఆపలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

వాసవీ కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ



పూజలో పాల్గొన్న మాజీ మంత్రి శ్రీనివాస్‌ గౌడ్‌, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఆర్యవైశ్యులు

కూకట్‌పల్లి: బాలాజీనగర్‌లో వాసవీ కన్యకా పరమేశ్వరి విగ్రహ ప్రతిష్ఠ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు ప్రాతకాల పూజలు, హోమాలు, 8.47 గంటలకు వాసవీ మాతా శ్రీ నగరేశ్వర స్వామి, శ్రీగణపతి, సుబ్రహ్మణ్య, నంది, ధ్వజ, శిఖర పరివార దేవతల యంత్ర ప్రతిష్ఠ, విగ్రహమూర్తి ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, మధ్యాహ్నం 1.30 గంటలకు అన్నదానం, 2.30 గంటలకు వేద ఆశీర్వచనం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌, మాజీ కార్పొరేటర్‌ బాబూరావు, బీజేపీ రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి రాజేశ్వరావు, బాలాజీనగర్‌ అధ్యక్షుడు డాక్టర్‌ వెంకట్రావు, నాగరాజు, ఆర్యవైశ్య ప్రముఖులు భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శ్మశాన వాటికల్లో పనులు పూర్తి చేయాలి

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
● కార్పొరేటర్లు, అధికారులతో సమావేశం



సమావేశంలో ఎమ్మెల్యే కృష్ణారావు, అధికారులు, కార్పొరేటర్లు

కూకట్‌పల్లి: శ్మశాన వాటికల్లో పనులను పూర్తి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఇంజినీరింగ్‌, హార్టికల్చర్‌, ఎలక్ట్రికల్‌ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని శ్మశాన వాటికలన్నీ పరిశీలించామని, 60 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ఇంకా నిధులు కావాలంటే అంచనాలు తయారు చేసి అందజేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో కార్పొరేటర్‌లు ముద్దం నర్సింహయాదవ్‌, ఆవుల రవీందర్‌రెడ్డి, జూపల్లి సత్యనారాయణ, సబిహా బేగం, మాజీ కార్పొరేటర్‌లు బాబూరావు, శ్రావణ్‌కుమార్‌, ఇంజినీరింగ్‌ అధికారులు ఎస్‌సీ చిన్నారెడ్డి, ఈఈ గోవర్ధన్‌, శ్రీనివాస్‌, డీఈలు, ఏఈలు హార్టికల్చర్‌, ఎలక్ట్రికల్‌ అధికారులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు కూల్చివేయాలి



జోనల్‌ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్‌ నాయకులు

కూకట్‌పల్లి: జీ ప్లస్‌ 2 అనుమతులు తీసుకుని అక్రమంగా అదనంగా మరో మూడు అంతస్తులు నిర్మించిన బాలానగర్‌ కార్పొరేటర్‌ ఆవుల రవీందర్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్‌ నియోజకవర్గ ఏ బ్లాక్‌ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగందర్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. సోమవారం కూకట్‌పల్లి జోనల్‌ కమిషనర్‌ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో కాంగ్రెస్‌ బాలానగర్‌ డివిజన్‌ అధ్యక్షుడు మధుగౌడ్‌, నాయకులతో కలిసి జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేటర్‌ నిర్మించిన అక్రమ నిర్మాణాన్ని కూల్చివేయాలని కోర్టు ఆదేశాలు ఉన్నా అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. అధికారుల తీరు మార్చుకోవాలని సూచించారు. అక్రమ నిర్మాణం కూల్చేందుకు చర్యలు చేపడతామని జోనల్‌ కమిషనర్‌ తెలిపినట్లు ఆయన తెలిపారు.

జిల్లా స్థాయి ఫిజికల్‌ సైన్స్‌ టాలెంట్‌ టెస్ట్‌



కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

కూకట్‌పల్లి: తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ ఎస్సీఆర్టీ సౌజన్యంతో ఫోరం ఫర్‌ ఫిజికల్‌ సైన్స్‌ టీచర్స్‌ ఆధ్వర్యంలో సోమవారం 10వ తరగతి విద్యార్థులకు జిల్లా స్థాయి ఫిజికల్‌ సైన్స్‌ ఆన్‌లైన్‌ టాలెంట్‌ టెస్ట్‌ను కూకట్‌పల్లిలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల నిర్వహించారు. జడ్పీహెచ్‌ఎస్‌ బాచుపల్లి విద్యార్థి కె విజయ్‌కు మొదటి స్థానం, జడ్పీహెచ్‌ఎస్‌ జీడిమెట్ల విద్యార్థి శరణ్యకు ద్వితీయస్థానం, భౌరంపేట్‌ జడ్పీహెచ్‌ఎస్‌ విద్యార్థి సాయి సంతోష్‌కి తృతీయస్థానం, బోడుప్పల్‌ జడ్పీహెచ్‌ఎస్‌ విద్యార్థి అక్షయ్‌కుమార్‌కు కన్సోలేషన్‌ బహుమతి అందజేశారు. మొదటి మూడు స్థానాల విద్యార్థులు 12వ తేదీన రాష్ట్ర స్థాయి టాలెంట్‌ టెస్ట్‌లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఎకాడమీ మానిటరింగ్‌ ఆఫీసర్‌ రవీందర్‌ రాజు మాట్లాడుతూ.. ఈ రోజుల్లో సైన్స్‌కు ఎక్కువ ప్రాముఖ్యత ఉందన్నారు. విద్యార్థులు దృష్టి సారించి కొత్త కొత్త విషయాలను కనుగొని మానవ జీవితం సులభతరం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఫోరం అధ్యక్షులు శ్రీకాంత్‌ రెడ్డి, జనరల్‌ సెక్రటరీ మధుసూదన్‌, ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు అజయ్‌ సింగ్‌, రాష్ట్ర కోశాధికారి శ్రీనివాసచారి, బీసీఈబీ సెక్రటరీ సురేష్‌, జిల్లా సైన్స్‌ అధికారి శ్రీనివాస్‌ రెడ్డి, స్థానిక జడ్పీహెచ్‌ఎస్‌ హెచ్‌ఎం నరేందర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ ఆదాయం లెక్కింపు



జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్ట కొండపై ఉన్న లక్ష్మీ వేంకటేశ్వరస్వామి 54వ బ్రహ్మోత్సవాలు ఇటీవలే ముగిశాయి. సోమవారం బ్రహ్మోత్సవాలలో వచ్చిన ఆదాయాన్ని ఈఓ కృష్ణమాచార్యులు, కమిటీ సభ్యుల సమక్షంలో లెక్కించారు. హుండీ ద్వారా రూ.2,39,528, తైబజారు ద్వారా రూ.3,48,400, కట్నాల రూపంతో రూ.1,57,401, ఇతరత్రా రూ.2,57,500 ద్వారా మొత్తం రూ.10,02,829 ఆదాయం వచ్చింది. బ్రహ్మోత్సవాలకు సుమారు రూ.6,61,671 ఖర్చు చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ నరేందర్‌ రెడ్డి, బుచ్చిరెడ్డి, వేణు గౌడ్‌, రవీందర్‌, సునీత, రాజు, సుధాకర్‌ రావు, శశి, శ్రీనివాస్‌, మల్లికార్జున్‌ రెడ్డి, సంజీవ్‌ రెడ్డి, చంద్రమోహన్‌, దేవాదాయ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామస్తులు ఐక్యంగా ఉండండి..



రంగంలో భవిష్యవాణిని వినిపిస్తున్న రాజేష్‌

సుభాష్‌నగర్‌: 'గ్రామస్తులంతా ఐక్యంగా ఉండి ఆలయాన్ని కాపాడండి, నేను మిమ్మల్ని కాపాడుతా, ఆలయానికి వ్యతిరేకంగా ఉన్న శక్తులను నా కాలితో నలిపేస్తా.. ప్రతి సంవత్సరం ఇదే విధంగా జాతరను నడిపించండి గ్రామాన్ని నేను కాపాడుత' అంటూ సూరారంలోని కట్ట మైసమ్మ, రేణుకా ఎల్లమ్మ జాతరలో భాగంగా సోమవారం రంగం కార్యక్రమంలో రాజీవ్‌ గాంధీనగర్‌ చెందిన రాజేష్‌ భవిష్యవాణిని వినిపించారు. భవిష్యవాణి వినడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారికి సమర్పించిన చీరల వేలంపాట వేశారు. సాయంత్రం సూరారం గ్రామం నుంచి ఆలయం వరకు పోతరాజుల విన్యాసాల మధ్య ఫలహారం బండి ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది.

ప్రభుత్వ స్థలం కబ్జాపై ఫిర్యాదు



నిజాంపేట్‌: బాచుపల్లి మండలం నిజాంపేట్‌లోని శివాలయం పక్కనే ఉన్న సర్వే నంబర్‌ 233/21లోని ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని మాజీ మేయర్‌ కొలను నీలాగోపాల్‌రెడ్డి, బీజేపీ నిజాంపేట్‌ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీష్‌ కోరారు. జిల్లా కలెక్టర్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ప్రహరీ నిర్మాణం చేపట్టేందుకు పనులు ప్రారంభించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అడ్డుకోవడానికి వచ్చిన ఆర్‌ఐని సైతం లెక్కచేయలేదని తెలిపారు. 233/21లోని ప్రభుత్వ స్థలాన్ని ప్రజల అవసరాల కోసం వినియోగించాలని కోరారు.